ప్రజాశక్తి
www.prajasakti.com





ఆలయం తలుపులు మూసివేసిన దృశ్యం

## చంద్రగ్రహణంతో శ్రీవారి ఆలయం 11గంటల పాటు మూసివేత

**ప్రజాశక్తి- తిరుమల:**

చంద్రగ్రహణం కారణంగా తిరుమలలో శ్రీవారి ఆలయాన్ని టిటిడి మూసివేసింది. ఈ నేపథ్యంలో లడ్డూ కౌంటర్, అన్నప్రసాద వితరణ కేంద్రాన్నీ మూతపడ్డాయి. చంద్రగ్రహణం కారణంగా దాదాపు 11 గంటల పాటు ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్టు ఆలయ ప్రధానఅర్చకులల్లో ఒకరైన శేషాచల దీక్షితులు చెప్పారు. స్వామివారికి సుప్రభాతం, తోమాల, అర్చన, మొదటి నైవేద్యం వంటి సేవాకార్యక్రమాన్ని నిర్వహించి ఉదయం 8.40 గంటలకు మహాద్వారం తలుపులను మూసివేశామని తెలిపారు. రాత్రి తిరిగి 7:30 గంటలకు ఆలయ తలుపులను తెరిచి శుద్ధి చేసిన అనంతరం భక్తులను అనుమతించినట్లు చెప్పారు.

## ప్రేమికుల ఆత్మహత్య

**ప్రజాశక్తి - తిరుపతి**

ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతిలో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు..నగరంలోని గోవిందరాజస్వామి ఆలయ ఉత్తరమాఢవీధిలోని ఓ లాడ్జిలో ప్రేమికులిద్దరూ సోమవారం దిగారు. 24 గంటలు గడిచినా వారు బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వహకులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని గది తలుపులు పగలకొట్టి చూడగా ప్రేమికులిద్దరూ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని ఉన్నారు. వారి వద్ద ఉన్న ఆధారాల ప్రకారం మృతులు హైదరాబాద్‌కు చెందిన కృష్ణారావు, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన అనూషగా పోలీసులు గుర్తించారు. ప్రేమించిన వ్యక్తిని కాదని అనూషకు మరోకరితో కుటుంబసభ్యులు పెళ్లి చేయడంతో ప్రేమికులిద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా కోవూరు పోలీస్ స్టేషన్లో ఈ నెల మూడో తేదీన అనూష పై మిస్సింగ్ కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఏలూరు ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ గంగరాజుకు మాతృవియోగం

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**



ప్రజాశక్తి ఏలూరు స్టాఫ్ రిపోర్టర్ పి.గంగరాజుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి పి.హైమావతి (67) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన హైమావతికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె భర్త, కుమార్తె కొంతకాలం కిందట మృతి చెందారు. గంగరాజు మూడో కుమారుడు. హైమావతి భౌతికకాయాన్ని ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, పలువురు నేతలు సంతాపం తెలిపారు. మంగళవారం సాయంత్రం హైమావతి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు సంతాపం తెలిపారు.

# కొత్త నియామకాలు డీలా

- మాంద్యం భయాలు
- ఒత్తిడిలో పలు రంగాలు
- ఎంఇఐ అధ్యయనంలో వెల్లడి

**ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్**

దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న భయాలు ఉద్యోగ నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మాంద్యం ముంచుకొస్తోందనే ఆందోళనలకు తోడు స్టార్టప్ రంగం ఎదుర్కొంటున్న ఫండింగ్ సమస్యలు కొత్త ఉద్యోగాల సృష్టికి ప్రధాన అడ్డంకింగా నిలుస్తున్నాయి. గతేడాది అక్టోబర్‌లోని నియామకాలతో పోల్చితే ప్రస్తుత ఏడాది క్రితం నెల నియామకాల్లో 6 శాతం తగ్గుదల చోటు చేసుకుందని మోన్‌స్టార్ ఎంప్లాయిమెంట్ ఇండెక్స్ (ఎంఇఐ) ఓ రిపోర్టులో తెలిపింది. ప్రతీనెల, నెలకు నియామకాలు పడిపోతున్నాయని విశ్లేషించింది.

గడిచిన అక్టోబర్ నెలలో ఆటోమేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, 5జి రంగాల్లో మినహా మిగితా రంగాలన్నీ ఒత్తిడిలోనే ఉన్నాయని తెలిపింది. దేశంలో నియో బ్యాంకింగ్ పద్దతులు పెరుగుతున్న నేపథ్యంలో ఫిన్‌టెక్ రంగంలో ఉద్యోగ కల్పన పెరిగిందని తెలిపింది. పండగ సీజన్ నేపథ్యంలో రిటైల్, అభరణాలు, వస్త్రాల రంగంలో నియామకాలకు డిమాండ్ నెలకొందని పేర్కొంది. మరోవైపు బిపిఒ, టెక్నలాజీ ఆధారిత సంస్థలు, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, ఐటి, విద్యా, వైద్య, ఇంజనీరింగ్ తదితర రంగాల్లో ఉద్యోగ కల్పన భారీగా తగ్గిపోయింది.



| రంగం | తగ్గిన నియామకాలు |
|---|---|
| బిపిఒ, ఐటిఇఎస్ | (-16%) |
| మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ | (-24%) |
| ఐటి | (-19%) |
| విద్యా | (-11%) |
| వైద్యం | (-23%) |
| సప్లయి చెయిన్ | (-20%) |
| ఇంజీనీరింగ్ | (-20%) |

**హైదరాబాద్‌లో 5 శాతం క్షీణత**

ద్వితీయ శ్రేణీ నగరాల్లో ఉద్యోగ నియామకాల్లో ఏడాదికేడాదితో పోల్చితే కొంత సానుకూలత చోటు చేసుకుంది. కోయంబత్తూరు, అహ్మదాబాద్ నగరాలు స్థిర వృద్ధిని నమోదు చేశాయి. మెట్రో నగరాల్లో ముంబయి కూడా స్థిర ఉద్యోగ కల్పనలు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్‌లో 5 శాతం, బెంగళూరులో 11 శాతం, కోల్‌కత్తాలో 14 శాతం, ఢిల్లీ-ఎన్‌సిఆర్ 2 శాతం చొప్పున తగ్గుదల నమోదయ్యింది. గుజరాత్‌లోని బరోడాలో ఉద్యోగ కల్పన ఏకంగా 22 శాతం, చండీఘడ్‌లో 16 శాతం చొప్పున పతనం చోటు చేసుకోవడం ఆందోళనకరం. ప్రతీ నెల ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటనలను విశ్లేషించి ఈ రిపోర్టును రూపొందించింది. 2022 అక్టోబర్ 1 నుంచి 31వ తేదిల్లో వచ్చిన మోన్‌స్టార్ ఎంప్లాయిమెంట్ ఇండెక్స్ (ఎంఇఐ) డేటా ఆధారంగా విశ్లేషణ చేసింది.

## విశాఖలో రూ.1600 కోట్ల 'రేడియంట్' కుంభకోణం

- మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

విశాఖలో 'రేడియంట్' ప్రాజెక్టు భూ కుంభకోణం విలువ రూ.1600 కోట్లు ఉంటుందని, ఇది ఓ పెద్ద భూమాయ అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. విశాఖలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేడియంట్ ప్రాజెక్టు భూ కుంభకోణంపై తాను కొద్ది రోజుల కిందట చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. తనపై పరువు నష్టం దావా వేస్తానని వైసిపి ఎంపి వేమూరి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ భూ కుంభకోణ వ్యవహారంపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని, తన వద్ద అన్ని సాక్ష్యాలూ ఉన్నాయని తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పెదనాన్న కుమారుడు అనిల్‌రెడ్డితో కలిసి ఎంపి ప్రభాకర్‌రెడ్డి ఈ దోపిడీకి తెర తీశారని ఆరోపించారు. జగన్ కుటుంబం ప్రభాకర్‌రెడ్డిని ఒక పావుగా వాడుకుంటోందని విమర్శించారు. విశాఖలోని పారిశ్రామికవేత్తలను బెదిరించి వారి ఆస్తులను లాక్కుంటున్నారని, రాజధాని పేరుతో ఈ దోపిడీ సాగుతోందని ఆరోపించారు. జివిఎంసి కమిషనర్‌గా నిజాయితీతో పని చేసిన లక్ష్మీశను ఎందుకు బదిలీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గీతం విద్యాసంస్థల అధినేత భరత్‌లతోపాటు తాను రూ.5 వేల కోట్ల విలువైన భూములను కబ్జా చేసినట్లు ఎంపి విజయసాయిరెడ్డి ఆరోపించారని, వాస్తవాలను నిరూపించాలని అన్నారు. కబ్జాలకు పాల్పడినట్టు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని, లేకుంటే విజయసాయిరెడ్డి తన ఎంపి పదవికి రాజీనామా చేయాలని సవాలు విసిరారు.




## సెలూన్ రంగంలోకి కార్పొరేట్ శక్తులు

- గుంటూరులో నాయీబ్రాహ్మణుల నిరసన

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి**

క్షౌరవత్తిదారుల పొట్ట కొట్టడానికి రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ ఆరువేల సెలూన్లు పెట్టేందుకు ముందుకు రావటం దుర్మార్గమని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ జెఎసి అధ్యక్షులు తాడికొండ నరసింహారావు అన్నారు. రిలయన్స్‌కు ఇచ్చిన అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెలూన్ రంగంలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించి వృత్తిని వ్యాపారంగా మార్చడం హీనమైన చర్య అన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా ముందుకు వెళితే కార్పొరేట్ శక్తులు పెట్టే సెలూన్స్‌ను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో జెఎసి నగర కన్వీనర్ టి.శ్రీను, కో-కన్వీనర్ ఎ.బాలకోటి, నాయీ బ్రాహ్మణ సౌందర్య శాలల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ కె.బత్తేశ్వరరావు, బిసి మహాజన సభ కన్వీనర్ యు.సాంబశివరావు, రజక జనసేవా సంఘం ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, బిఎస్‌పి నాయకులు జి.శామ్యూల్, నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు బి.శ్రీమన్నారాయణ, కె.నాగార్జున, కె.శ్రీను, వై.శంకర్ పాల్గొన్నారు.



నిర్వాసితులనుద్దేశించి మాట్లాడుతున్న రాము

## జెట్టీ నిర్మించాలి

- ఎన్ఎఒబి నిర్వాసితుల పోరాటానికి సిఐటియు మద్దతు

**ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)**

తమ సమస్యలను పరిష్కరించాలంటూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడ నర్సాపురం గ్రామం వద్దనున్న నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) మెయిన్ గేటు వద్ద నేవల్ బేస్ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన మంగళవారానికి తొమ్మిదో రోజుకు చేరింది. వారి పోరాటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము మద్దతు తెలిపి మాట్లాడారు. నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించకపోవడం బాధాకరమన్నారు. మత్స్యకారుల ఉపాధికి ఆటంకం లేకుండా జెట్టీ నిర్మించాలని, నేవల్ బేస్ ప్రాంతం నుంచి వేరొక చోటుకు తరలించిన నాలుగు గ్రామాల ప్రజలకు మౌలిక సదుపాయాలు, నిర్వాసితులకు పూర్తి స్థాయి ప్యాకేజీ, స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో పోరాటాలు చేసినప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు. కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న నిర్వాసితులను తహశీల్దారు, ఎస్‌డిసి పట్టించుకోకపోవడం సరికాదని తెలిపారు. ఈ నెల 12న దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖ వస్తున్న నేపథ్యంలో నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు, ఎనిమిది గ్రామాల ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మీటర్లు వేగవంతం

- సచివాలయ కార్యదర్శుల సహకారం : ప్రభుత్వ ఆదేశం

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

విద్యుత్ సంస్కరణల్లో భాగంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. దీనిలో భాగంగా విద్యుత్ సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు, ఆ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని బ్యాంకర్లను ఆదేశించింది. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టుకున్న రైతులను గుర్తించడం, వారికి బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం వంటి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బ్యాంకు ఖాతాల ఏర్పాటు ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని నిర్ధేశించింది. మీటర్ల ఏర్పాటు ప్రక్రియతో పాటు, అర్హులైన వారికి బ్యాంకు ఖాతాలను ఏర్పాటు చేయడంలో గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల సహకారం తీసుకోవాలని సూచించింది. ఈ మొత్తం ప్రక్రియకు విద్యుత్ శాఖ అధికారులు కూడా భాగస్వామ్యులు కావాలని నిర్దేశించారు. వ్యవసాయశాఖ, ఇంధన శాఖ, సచివాలయాల శాఖల అధ్వర్యంలో ఇప్పటికే మీటర్లు పెట్టుకున్న వారి జాబితాను సిద్ధం చేయాలని, కొత్తగా మీటర్లు పెట్టుకోవాల్సిన వారిని కూడా గుర్తించాలని ప్రభుత్వం పేర్కొంది.

**ఇళ్ల రుణాలకు వడ్డీ తగ్గించండి :బ్యాంకర్లకు ప్రభుత్వం విజ్ఞప్తి**

ఎస్‌హెచ్‌జి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎక్కువ వడ్డీలు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఆ వడ్డీ శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కూడా బ్యాంకర్లను రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. అలాగే రుణ పరిమితితో సంబంధం లేకుండా అన్ని ఇళ్ల రుణాలపై డాక్యుమెంటేషన్ ఛార్జీలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. కౌలు రైతులకు ఆర్థిక సాయాన్ని మరింతగా అందించేందుకు చొరవ చూపపించాలని కోరింది.

## మానసిక వికాసానికి బాలోత్సవం దోహదం

- బాలోత్సవం కార్యాలయం ప్రారంభోత్సవంలో వక్తలు

**ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)**

ఆటలు, పాటలు, సాంస్కృతిక కళా ప్రదర్శనల్లో పిల్లలను ప్రోత్సహించేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని పలువురు ప్రముఖులు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో బాలోత్సవ కార్యాలయం మంగళవారం ప్రారంభమైంది. కార్యాలయాన్ని మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు టి.సతీష్ ప్రారంభించగా, కార్యా లయం చిరునామా బోర్డును ఫ్యూజన్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పి.లక్ష్మి, ల్యాప్‌టాప్‌ను ఆంధ్రనాటక కళాపరిషత్ చైర్మన్ నన్నపనేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు.



మంగళగిరి - తాడేపల్లి బాలోత్సవం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు టి.సతీష్

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆలోచనలు, వారి అభిప్రాయాలను పెద్దలు గౌరవించాలని అన్నారు. పిల్లల్లో ప్రశ్నించేతత్వంతోపాటు వారు స్వతంత్రంగా ఎదిగేలా పెద్దలు కృషి చేయాలని సూచించారు. పిల్లల మానసిక వికాసానికి బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. ఎంటిఎంఎస్ (మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పోరేషన్) పరిధితోపాటు దుగ్గిరాల, తుళ్లూరు మండలాల్లోని సుమారు 210 పాఠశాలలకు బాలోత్సవానికి సంబంధించి బ్రోచర్‌లు అందిస్తామని తెలిపారు. వచ్చే నెల 6, 7 తేదీల్లో కెఎల్.యూనివర్సిటీలో జరిగే మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం పిల్లల పండుగలో 40 అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్మల జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ వివి.ప్రసాద్, కెఎల్.యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీపతిరాయ్, బాలోత్సవాల రాష్ట్ర సమన్వయకర్త పిన్నమనేని మురళికృష్ణ, మాజీ సైనికోద్యోగి గోపాలం సాంబశివరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనీల్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు గాదె సుబ్బారెడ్డి, అమరావతి బాల్సోతవం నిర్వాహకులు ఐజక్ న్యూటన్, ఎం.భాగ్యరాజు పాల్గొన్నారు.

# 'అదనపు సమన్వయకర్తల' విఫల ప్రయోగం

- 30 నియోజకవర్గాల్లో వైసిపి నేతల నియామకం నిలిపివేత
- తాడికొండ గందరగోళంతో వెనక్కి తగిన అధిష్టానం

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి**

రాష్ట్రంలో వైసిపి ఎమ్మెల్యేల గ్రాఫ్ తక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో అదనపు సమన్వయకర్తలను నియమించాలనే ఆ పార్టీ అధినాయకత్వం ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రాఫ్ పడిపోయిన 30 మంది ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వకూడని పార్టీ అధిష్టానం ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా ఆయా నియోజకవర్గాల్లో పట్టు సాధించడానికి సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో అదే స్థాయిలో పట్టున్న నాయకులను అదనపు సమన్వయకర్తలుగా నియమించాలని పార్టీ అధిష్టానం గత ఆగస్టులో నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆగస్టు 19న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం అదనపు సమన్వయకర్తగా సిఎం జగన్ నియమించారు. డొక్కా నియామకాన్ని వ్యతిరేకిస్తూ తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి గ్రూపు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించింది. దీంతో నియోజకవర్గంలో వైసిపి రెండు గ్రూపులుగా విడిపోయింది. శ్రీదేవి అనుకూల, వ్యతిరేక గ్రూపుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. చివరికి పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన అధిష్టానం మాణిక్య వరప్రసాద్‌ను వెనక్కి తగ్గాలని సూచించినట్టు వైసిపి శ్రేణుల్లో ప్రచారమైంది. తాడికొండపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని భావించిన మాణిక్య వరప్రసాద్ స్పీడ్‌కు అధిష్టానం బ్రేకులు వేసినట్లవడంతో ఆయన నెల రోజులుగా మౌనంగా ఉంటున్నారు. తాడికొండ తరువాత పొన్నూరు, ప్రత్తిపాడు, గురజాల తదితర నియోజకవర్గాలకు కూడా అదనపు సమన్వయకర్తలను నియమిస్తారని వైసిపిలో జోరుగా ప్రచారం సాగింది. అయితే తాడికొండలో ఈ ప్రయోగం విఫలం కావడంతో ఈ ప్రతిపాదన విరమించుకున్నారు. ఇదే రీతిలో మరో 30 నియోజకవర్గాల్లోనూ అదనపు సమన్వయకర్తల ప్రతిపాదనను తాత్కాలికంగా విరమించినట్లు సమాచారం. అయితే ప్రజల్లో గ్రాఫ్ పడిపోయిన వారికి సిఎం జగన్ ఆరు నెలలు సమయం ఇచ్చారని, ఇందులో భాగంగానే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారని పార్టీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో పార్టీలో అన్ని తరగతుల నాయకులతో సయోధ్యగా ఉంటూ ప్రజలతో మమేకం కావాలని సూచించారని, ఆరు నెలల తరువాత సమీక్షించి అప్పుడు పూర్తిస్థాయిలో అదనపు సమన్వయ కర్తల ప్రణాళికను అమలు చేస్తారని చెప్పారు.

**BOARD OF INTERMEDIATE EDUCATION, A.P.**
R.No.114/C3, Eswar Elite, Beside Sonovision, Tadepalli, Guntur-522 501.
Rc.No. 926/C26-2/March 2023. Dated: 27-10-2022
**SHORT TENDER NOTICE**
The Secretary, BIE, AP invites Sealed tenders from reputed and experienced Software Development Agencies for Data Processing for conduct & Results Preparation (General & Vocational) of Intermediate Public Examinations in March 2023 and Advanced Supplementary Examinations in May 2023. The details and Tender document for downloading are available in website : https://bie.ap.gov.in
Sd/- M.V. Seshagiri Babu, I.A.S., Secretary

Muthoot Homefin
**ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్**
కార్పొరేట్ కార్యాలయం: 1201 & 1202, 12వ అంతస్తు, 'ఎ' వింగ్, లోటస్ కార్పొరేట్ పార్క్, కార్యాలయం. వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, గోరెగావ్ (ఈస్ట్), ముంబాయి-400 063.
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1)తో చదువుతూ అనుబంధం IV ప్రకారంగా) **స్వాధీనత ప్రకటన**
ఏదైతే ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్ (ఎంహెచ్‌ఐఎల్) యొక్క దిగువ సంతకందారుడైన అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసులో తెలిపిన విధంగా రుణగ్రహీత(లు)/హామీదారు(లు)కు అధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడినాయి. రుణగ్రహీత, మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు, సదరు రూల్స్ యొక్క 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి క్రింద వివరించబడిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు నిర్వహించరాదని, సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు దానిపిమ్మట వడ్డీతో ఇక్కడ పేర్కొన్న మొత్తం ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి మాత్రమే జరుగవలెనని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
రుణగ్రహీతలకు జాగ్రత్త ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు ఉన్నంత సమయంలో చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలకు అహ్వానించడమైనది.

| క్ర. సం | రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) పేరు/ లోను ఖాతా నం./శాఖ | సెక్యూర్డ్ అస్సెట్స్ వివరణ (స్థిరాస్తి) | డిమాండ్ నోటీసు తేది & మొత్తం బకాయిలు (రూ.) | స్వాధీనత తీసుకున్న తేది |
|---|---|---|---|---|
| 1. | నాగేశ్వరరావు సుబ్బారావు తేనిశెట్టి/ సుబ్బలక్ష్మి నాగేశ్వరరావు తేనిశెట్టి/ 049-04900019/రాజమండ్రి. | డో.నం. 4-51, ఆర్.ఎస్.నం.120/2, గంటి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, కొత్తపేట మండలం, తూర్పు గోదావరి జిల్లా-ఎపి-533211. | 24-జూన్-2022/రూ॥19,56,317/- (పంతొమ్మిది లక్షల యాభై ఆరు వేల మూడు వందల పదిహేడు రూపాయలు మాత్రమే) | 04/ Nov/ 2022 |

తేది: 09 నవంబర్, 2022
ప్రదేశం: ఎపి/తెలంగాణ.
సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్.

ICICI Home Finance
కార్పొరేట్ ఆఫీస్: ఐసిఐసిఐ ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అంధేరీ-కుర్లా రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి 400059,
బ్రాంచ్ ఆఫీస్: డోర్ నెం.13-1-54, 1వ ఫ్లోర్, డా.ఎన్‌వి రమేష్ కాంప్లెక్స్, రామయ్య వీధి, మెయిన్ రోడ్, కాకినాడ-533001.
(రూల్ నెం.8(6) నిబంధన ప్రకారం)
స్థిరాస్థి విక్రయానికి నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002తో పాటు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) ప్రకారం స్థిరాస్తుల విక్రయం కొరకు జారీ చేసిన ఇ-వేలం నోటీసు.
దిగువ పేర్కొన్న రుణగ్రహీత(లు), హామీదారులు, సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియచేయునది ఏమనగా బ్యాంక్ (సెక్యూర్డ్ క్రెడిటార్)కు తనఖా పెట్టబడి, ఐసిఐసిఐ హోం ఫైనాన్స్‌కు చెదిన అధీకృత అధికారి భౌతిక స్వాధీనం చేసుకున్న ఈ దిగువ పేర్కొనబడిన స్థిరాస్తులు 'ఎక్కడ, ఎలా వున్నది అలా' 'అక్కడ ఏం వుంటే అది' ప్రాతిపదికన వేలం ద్వారా విక్రయించబడును.

| క్ర. సం | రుణగ్రహీత(లు)/సహరుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ధ వారసుల పేరు, రుణఖాతా నెం. | స్థిరాస్థి వివరాలు | బకాయి మొత్తము | రిజర్వ్ ధర / ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ | ఆస్థి పరిశీలనకు తేదీ, సమయము | వేలం తేదీ, సమయం |
|---|---|---|---|---|---|---|
| (A) | (B) | (C) | (D) | (E) | (F) | (G) |
| 1. | ద్యుమని శ్రీగిరినాథ్ పులిగడ్డ (రుణగ్రహీత), జయలక్ష్మి (సహరుణగ్రహీత) రుణఖాతా నెం. LHKKN00001250352 | డోర్ నెం.3-402/3, సర్వే నెం.44/3, డిటిసిపి హైదరాబాద్, ఎల్‌పి నెం.155/ 89, ప్లాట్ నెం.3 సర్పవరం గ్రామం, గ్రామ పంచాయితీ కాకినాడ రూరల్ మండలం, తూర్పు గోదావరి జిల్లా పిన్ 533005. | Rs. 42,70,879/- 04th Nov, 2022 | Rs. 28,22,510/- / Rs. 2,82,251/- | 21st Nov, 2022 11:00 AM 03:00 PM | 23rd Nov, 2022 02:00 PM 03:00 PM |

ఆన్‌లైన్ వేలం వెబ్‌సైట్ (UTL Link-https://saraesi.auctiontiger.net/EPROC/) పై మా వేలం ఏజెన్సీ Auction Tiger ద్వారా విక్రయించబడును. ది.22, నవంబర్ 2022 సాయంత్రం 5 గంటలలోపు మొత్తం బకాయి సొమ్ము చెల్లించేందుకు రుణగ్రహీత/తనఖాదారులకు ఇది చివరి అవకాశంగా పరిగణించబడును, లేని యెడల తనఖా ఆస్తులు పై షెడ్యూలు ప్రకారం విక్రయించబడును.
ఆసక్తి కలిగిన బిడ్డర్లు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఎండి)ని ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, డోర్ నెం.13-1-54, డా.ఎన్‌వి రమేష్ కాంప్లెక్స్, రామయ్య వీధి, మెయిన్‌రోడ్, కాకినాడ 533001 పేరిట ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా 22, నవంబర్ 2022 సా.4 గంటలలోపు చెల్లించవలెను. పైన పేర్కొన్న షెడ్యూలు సమయంలోగా తమ ఆఫర్‌ను సమర్పించలేని బిడ్డర్లు టెండరు డాక్యుమెంట్లపై సంతకం చేసి వాటిని ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, డోర్ నెం.13-1-54, 1వ ఫ్లోర్, డా.ఎన్‌వి రమేష్ కాంప్లెక్స్, రామయ్య వీధి, మెయిన్‌రోడ్, కాకినాడ 533001 చిరునామాకుఇఎండి సొమ్ము ఐసిఐసిఐ హోంఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-అక్షన్ పేరిట తూర్పుగోదావరిలో చెల్లించబడే విధంగా జాతీయ/షెడ్యూల్డు బ్యాంకు నుండి తీసిన డిడిని జత చేసి ది.22 నవంబర్ 2022లోగా అందచేయాలి.
ఆస్తుల పరిశీలన, వేలం విధి విధానాలు, టెండర్ దాఖలు వంటి అంశాలపై మరిన్ని వివరణల కోసం 7021072869 నెంబర్‌పై ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను సంప్రదించగలరు.
దాఖలైన బిడ్‌లను ఎటువంటి కారణమూ చూపకుండానే తిరస్కరించే అధికారం అధీకృత అధికారికి వుంది.
విక్రయానికి సంబంధించిన మరిన్ని నియమ, నిబంధనల కోసం దయచేసి https://www.icicihfc.com ను సందర్శించండి.
తేదీ: నవంబర్ 09, 2022
స్థలం: తూర్పు గోదావరి
అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్



విలేకర్లతో మాట్లాడుతున్న కేసన శంకరరావు, ఇతర నాయకులు

## ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

- బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

**ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)**

ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు విరుద్ధమని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. 103వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ తాను ఎపి హైకోర్టులో పిల్ వేశానని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆర్థికంగా బలహీన వర్గాలు అనే పేరుతో ఆధిపత్య కులాలకు 103వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ రిజర్వేషన్ తెచ్చారని విమర్శించారు. ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇది నష్టదాయకమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కేంద్రం ఈ చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. 85 శాతంగా ఉన్న బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి 15 శాతంగా ఉన్న ఆధిపత్య కులాలకు పది శాతం రిజర్వేషన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కులగణన చేయాలని కోరుతున్నా పట్టించుకోని బిజెపి..ఇప్పుడు ఇడబ్ల్యుఎస్ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు కె.క్రాంతికుమార్, కె.శివరాం బాబాజీ, బి.శ్రీను, ఎ.బాలయ్య, కె.అశోక్ కుమార్, స్వాతి గౌడ్, పి.పుష్పాంజలి పాల్గొన్నారు.

## 2027 నాటికి ఎలక్ట్రికల్ కార్లు

- కియా ఇండియా ప్లాంట్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు క్యాబ్‌డాంగ్‌లీ

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

2025లో ఎలక్ట్రికల్ కార్ల తయారీని ప్రారంభిస్తామని కియా ఇండియా ప్లాంట్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ క్యాబ్‌డాంగ్ లీ తెలిపారు. 2027 నాటికి 14 రకాల మోడల్స్ విడుదల చేస్తామన్నారు. 2045 నాటికి వ్యర్థ ప్లాస్టిక్ రీసైక్లింగ్ ద్వారా కార్లకు అవసరమైన సామగ్రిని తయారు చేయడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలనే లక్ష్యం ఉందని వివరించారు. కియా ప్లాంట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద యర్రమంచిలో ప్లాంట్ ప్రారంభమై మూడేళ్లు అవుతోందని, 2019లో తొలి కారు తయారీ ప్రారంభమైందని చెప్పారు. ఇప్పుడు మూడు షిఫ్టుల్లో కార్లు తయారీ అవుతున్నాయని తెలిపారు. దేశీయంగా కియా కార్లకు గిరాకీ పెరుగుతోందన్నారు. కార్ల అమ్మకాల్లో కియా ఐదవ స్థానంలో ఉందని వివరించారు. ప్రస్తుతం నాలుగు రకాల కార్ల తయారీ ఇక్కడే జరుగుతోందని, ఏడాదికి సగటున 3.40లక్షల కార్లు తయారీ అవుతున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా 20 వేల మందికి ఉపాధి కలిగించామన్నారు. ఇందులో 80 శాతం మంది స్థానికులే ఉన్నారని తెలిపారు.